క్లుప్తంగా

హజ్ యాత్రికులకు ఎమ్మెల్సీ శుభాకాంక్షలు



హజ్ యాత్రికులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ జయమంగళ

కైకలూరు: ముస్లింల పుణ్యక్షేత్రమైన మక్కా నగర హజ్ యాత్రకు వెళుతున్న పలువురికి ఎమ్మెల్సీ జయమంగళ వెంకట రమణ శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం రాత్రి కైకలూరు రైల్వే స్టేషన్‌వద్ద యాత్రికులు కైకలూరుకు చెందిన మహమ్మద్ రాబాని సాహెబ్, రజవాని సాహెబ్, గోసియా సాహెబ్, అక్రమ్ ఖాన్‌లను ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ కలిశారు. యాత్ర విజయవంతం కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, ఎండీ ఉస్మాన్, అసానీ ఖాన్ పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

పమిడిముక్కల: అగినపర్రు గ్రామం నుంచి ఎస్సీ కాలనీకి వెళ్లె రోడ్డు పనులను వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కినేని సతీష్ సోమవారం ప్రారంభించారు. రోడ్డు నిర్మాణానికి మండల పరిషత్ నిధులు రూ.7 లక్షలు మంజూరైనాయని గణేష్ తెలిపారు. గ్రామంలో ఇటీవల ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ గడప గడపకు వచ్చినప్పుడు ఎస్సీ కాలనీ వాసులు రోడ్డును అభివృద్ధి చేయాలని కోరారని, ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నిధులు కేటాయించడంతో రబ్బీస్ రోడ్డు నిర్మిస్తునట్లు తెలియజేశారు. అడిగిన వెంటనే నిధులు మంజూరు చేయించినందుకు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ



వానపాముల(పెదపారుపూడి): మండలంలోని వానపాముల విద్యుత్ స్తంభం విరిగి లైన్లు పొలాల్లో పడిపోవటంతో సరఫరా లేక 'ఎండుతున్న వరి ఆకుమడులు' శీర్షికన కథనం సోమవారం ప్రచురితమైనది. దీనిపై విద్యుత్ శాఖ ఏడీ దశరథ్ స్పందించారు. వెంటనే విద్యుత్ శాఖ అధికారులను, సిబ్బందిని పంపించి కొత్త స్తంభం ఏర్పాటు చేశారు. తెగిన లైన్లను సరి చేశారు. విద్యుత్ సరఫరా ఇచ్చారు. దీంతో రైతులు హార్షం వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి ఎఫెక్ట్

పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలని వినతి

కైకలూరు: మండల పరిధిలో కొట్టాడ పంచాయతీ పల్లెపాలెంలో 8వ తరగతి వరకు ఉన్న పాఠశాలను పదో తరగతి వరకు విస్తరించాలని సామాజిక సేవాకర్త, బీజేపీ నాయకుడు లావేటి వీరశివాజీ ఏలూరులో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు అర్జీని అందించారు. విద్యార్థులు ప్రమాదకరమైన ఉప్పుటేరు దాటి హైస్కూల్ విద్యకు వెళుతున్నారన్నారు. కార్పొరేట్ స్కూల్స్ పుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారని, ఫీజులు సైతం ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. వీటిని నియంత్రించాలని మరో అర్జీ అందించామని ఆయన తెలిపారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యం

న్యాయమూర్తి రామకృష్ణయ్య



మచిలీపట్నంటౌన్: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ, జిల్లా కార్మికశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన న్యాయమూర్తి రామకృష్ణయ్య మాట్లాడుతూ ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు కృషి చేయాలన్నారు. ఏ రంగాల్లో బాలకార్మికులు పనిచేస్తున్న గుర్తించి వారి వికాసానికి పాటుపడాలన్నారు. కృష్ణాజిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే బాలకార్మికులను గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. కార్మికశాఖ సహాయ కమిషనర్ ఎస్.గోవింద్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జూన్ మొదటి తేదీ నుంచి నెలాఖరు వరకు బాలకార్మికుల నిర్మూలనకు చర్యలు తీసుకుందన్నారు. స్థానిక జిల్లా కోర్టు సెంటరు నుంచి బస్టాండ్ సెంటరు వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం మానవహారం నిర్వహించారు. సహాయ కార్మిక అధికారి జీవీ సారధి, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

55 మందికి వైద్య పరీక్షలు

పాగోలు(చల్లపల్లి): గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం వరంగా నిలుస్తోందని 104 డివిజన్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ కేఎస్ పెరుమాళ్ల అన్నారు. సోమవారం స్థానిక జగనన్న విలేజ్ క్లినిక్‌లో ఫ్యామిలీ డాక్టర్ శిబిరాన్ని పెరుమాళ్ల పరిశీలించారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

జగనన్న విద్యాకానుకల పంపిణీ కార్యక్రమంలో వక్తలు



తాడంకి జెడ్పీ పాఠశాలలో కిట్లు అందజేస్తున్న ఎంపీపీ సుప్రజ, సర్పంచ్ ధనలక్ష్మి



కిట్లు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు



పామర్రులో కానుకలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్



అల్లూరు హైస్కూల్లో కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, నేతలు

పమిడిముక్కల: విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని, బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎంపీపీ కాసాని వేద సుప్రజ విద్యార్థులకు సూచించారు. తాడంకి హైస్కూల్‌లో సోమవారం జగనన్న విద్యాకానుక కిట్లను ఎంపీపీ విద్యార్థులకు అందజేశారు. సుప్రజ మాట్లాడుతూ బడులు తెరిచిన తొలిరోజే విద్యాకానుక కిట్లు అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, ఎంపీటీసీ కె.శ్రీలక్ష్మి, హెచ్ఎం వై. శివనాగ ప్రసాద్, పేరెంట్స్ కమిటీ సభ్యులు కంభపు రాంబాబు, అభివృద్ధి కమిటీ సభ్యులు యేనుగ మస్తాన్ రావు, పీడీ రాజు పాల్గొన్నారు. హనుమంతపురం హైస్కూల్‌లో సర్పంచ్ కలపాల రాంబాబు, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, మాజీ ఎంపీపీ శొంఠి వెంకటేశ్వరరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పరసా నాగనవ్య పాల్గొన్నారు. చోరగుడి హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ మర్రి దుర్గారావు, సర్పంచ్ కందిమళ్ల పూర్ణకుమారి, హెచ్ఎం శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు యేనుగ మస్తాన్‌రావు పాల్గొన్నారు. మండలంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో విద్యాకానుక కిట్లను విద్యార్థులకు అందజేసినట్లు ఎంఈఓ శ్రీనివాస్ తెలిపారు.

గుడివాడ టౌన్: పురపాలక సంఘ పరిధిలోని హైస్కూల్‌లు, అప్పర్ ప్రైమరీ, ప్రైమరీ పాఠశాలల్లో జగనన్న విద్యాకానుకలను పంపిణీ చేశారు. స్థానిక 18వ వార్డులోని మున్సిపల్ ప్రైమరీ పాఠశాల, గాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో ఈ పంపిణీ జరిగింది. మున్సిపల్ మాజీ కౌన్సిలర్ అల్లం సూర్యప్రభ, ప్రధానోపాధ్యాయులు షేక్ జానీ సాహెబ్, టి.నాగమణి, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్‌లు టి.కిరణ్మయి, ఎండీ షబీనా మరియు వైస్ చైర్మన్ ఎ.లక్ష్మీపార్వతి, వైఎస్సార్ సీపీవార్డు ఇన్‌చార్జ్ అల్లం రామ్మోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వానపాముల (పెదపారుపూడి): మండలంలోని వానపాముల హైస్కూల్‌లోని విద్యార్థులకు ప్రభుత్వం అందించిన జగనన్న కానుక కిట్లను గ్రామ సర్పంచి పాతూరి రమేష్, ఎంపీటీసీ జిజ్జువరపు రాజమ్మలు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మార్చిన ఘనత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పీఏసీఎస్ అధ్యక్షుడు పల్లా అరవింద్, వైఎస్సార్ సీపీ నేతలు పడాలి రామారావు, హెచ్ఎం రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కాజ(మొవ్వ): మొవ్వ మండలంలోని 9 జెడ్పీ పాఠశాలల్లో, 50 మండల పరిషత్ పాఠశాలల్లోని 3505 విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. మొవ్వ మండలం కూచిపూడి, పెదసనగల్లు గ్రామాల్లో జెడ్పీటీసీ రాజులపాటి పార్వతి, ఎంపీపీ కొండేటి ఇందిర కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాజ గ్రామంలోని శ్రీ పేకేటి సీతారామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 345 మంది విద్యార్థులు ఉండగా తొలిరోజు 148 మంది విద్యార్థులకు అందజేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి, కాజ ఉప సర్పంచ్ మంద శ్రీనివాసరెడ్డి, పీఎంసీ కమిటీ చైర్మన్ మంద ఈశ్వరి, హెచ్ఎం బండి రమాదేవి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పామర్రు: ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యా కానుకలను పంపిణీ చేస్తోందని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక జెడ్పీహైస్కూల్‌లో విద్యార్థులకు సోమవారం విద్యా కానుకలను పంపిణీ చేశారు. గత పరిస్థితులను సమూలంగా మారుస్తూ జగనన్న ప్రభుత్వంలో పాఠశాలలు తెరిచిన రోజే జగనన్న విద్యా కానుక కిట్‌లను అందజేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కె.స్వరూపరాణి, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ టీ శ్రీనివాసరావు, మండల ఆర్‌బీకే చైర్మన్ ఏ శ్రీనాథ్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ కె.కస్తూరి, ఎంఈవో విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొమరవోలు(పామర్రు): మండల పరిధిలోని కొమరవోలు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం కానుకలను గ్రామ సర్పంచ్ దిరిశం రత్నకుమారి పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడు శింగవరపు రామచంద్రరరావు, పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వ ప్రోత్సాహం

ముదినేపల్లి రూరల్ : రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో ప్రోత్సాహం ఇస్తున్నట్లు ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. మండలంలోని అల్లూరు జెడ్పీహైస్కూల్ విద్యార్థులకు జగనన్న విద్యాకానుకలు సోమవారం అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు ఎస్ రామోజీరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, సర్పంచ్ శీలం రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సతీష్‌బాబు, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధా, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, స్థానిక నేతలు జగనన్న విద్యాకానుకలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీల సభ్యులు పాల్గొన్నారు.

మండవల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జగనన్న విద్యాకానుక కిట్‌లను సర్పంచ్ మెండా ఝాన్సి పంపిణీ చేశారు. కుల, మతాలు, పార్టీల కతీతంగా ప్రభుత్వం అందజేస్తున్న విద్యాకానుక కిట్‌లను సద్వినియోగం చేసుకుని ఉన్నత ప్రమాణాలతో విద్యనభ్యసించాలని విద్యార్థులకు కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు చేబోయిన వీర్రాజు, మెండా సురేష్, తల్లిదండ్రులు, టీచర్స్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి అవసరం



శిక్షణ పొందుతున్న విద్యార్థులు

గుడ్లవల్లేరు: విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి అవసరమని నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారి సీపాన శ్రీనివాసరరావు అన్నారు. సోమవారం గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీలో 'స్కిల్ అవేర్‌నెస్ కాంపెయిన్' అనే అంశంపై విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిక్షణను ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లలోని స్కిల్ కాలేజీల్లో స్కిల్ అవేర్‌నెస్ కాంపెయిన్ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలేజీ చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి వల్లూరుపల్లి సత్యనారాయణ, సహ కార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ప్రసాద్, సలహాదారు డాక్టర్ పి.రవీంద్రబాబు, డైరెక్టర్ డాక్టర్ బి.కరుణకుమార్ పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

కైకలూరు: స్థానిక శ్యామలాంబ అమ్మవారికి ఆలయానికి 82 రోజుల కాలంలో భక్తులు సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయం వద్ద సోమవారం లెక్కించారు. అమ్మవారికి హుండీ ఆదాయం రూ.2,76,709, ఇదే ప్రాంగణంలో రామలింగేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.17,117, వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీల ద్వారా రూ.63,321 వచ్చిందని ఆలయ ఈఓ వీఎన్‌కే శేఖర్ చెప్పారు. కార్యక్రమంలో గుడివాడ దేవదాయశాఖ తనిఖీ అధికారి, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ దైవ చింతన ఉండాలి

వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బూరగడ్డ శ్రీనాథ్



భూమి పూజ చేస్తున్న బూరగడ్డ శ్రీనాథ్, పక్కన ఆరేపల్లి నాగరాజు

పామర్రు: ప్రతి వ్యక్తి దైవ చింతన కలిగి ఉండాలని విశ్వహిందూ పరిషత్ కృష్ణా జిల్లా అధ్యక్షుడు బూరగడ్డ శ్రీనాథ్ అన్నారు. పామర్రు, వీరాంజనేయపురం, కొండిపర్రు అడ్డరోడ్డు వద్ద జాతీయ రహదారి పక్కనే కొండిపర్రు సిద్ధాంతి ఆరేపల్లి నాగరాజు ఆధ్వర్యంలో వినాయక క్షేత్ర స్థలంలో 63 అడుగుల పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటుకు సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంజనేయస్వామి ని ఆరాధిస్తే సకల దేవతల అనుగ్రహం కలుగుతుందన్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘ కన్వీనర్ శొంఠి నాగరాజు మాట్లాడుతూ ఆంజనేయస్వామికి శ్రీరాముని పట్ల ఉన్న భక్తిని ఆదర్శప్రాయంగా తీసుకోవాలని అన్నారు. కలౌకపిచండి వినాయక ట్రస్టు కార్యదర్శి ఆరేపల్లి శ్రీదేవి, కోశాధికారి పీఎంఎస్ ప్రసాద్, విశ్వహిందూ పరిషత్ సభ్యులు వైఎస్ఎన్ ప్రసాద్, సెలెంద్ర రామకృష్ణ, నెరుసు కృష్ణ రామాంజనేయులు భక్త సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారం చేసిన సీఎం జగన్



గ్రీన్ విలేజ్‌లో శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: పేదల సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేరుస్తున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కైకలూరు జగనన్న గ్రీన్ విలేజ్‌లో లబ్దిదారుడు కరేటి రాంబాబు ఇంటి నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి సోమవారం ఆయన హాజరయ్యారు. గ్రీన్ విలేజ్‌లో ఇప్పటికే తాగునీరు, విద్యుత్, రహదారులను ఏర్పాటు చేశామన్నారు. గృహ నిర్మాణశాఖ అధికారులు, సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, వలంటీర్లు లబ్దిదారుల్లో అవగాహన కలిగించి త్వరగా నిర్మాణాలు చేపట్టే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సాంబశివరావు, శ్రీను పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణాలకు శంకుస్థాపన



అల్లూరులో శ్రీకృష్ణా ఆలయ శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే.

ముదినేపల్లి రూరల్ : మండలంలో రెండు గ్రామాల్లో ఆలయాల నిర్మాణాలకు సోమవారం శంకుస్థాపనలు చేశారు. ముదినేపల్లి మండలం పెనుమల్లి శివారు సింగారంలో కోదండ రామాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) శంకుస్థాపన చేశారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, సర్పంచ్ జంగం వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు కొండలరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మోత్రు ఏసుబాబు, ఉపసర్పంచ్ అనగాని మల్లేశ్వరరావు, నాయకులు కోమటి విష్ణువర్ధన్, ముత్యాల రాంబాబు, శ్రీరామచంద్రయ్య, బొర్రా చలమయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అల్లూరు శ్రీకృష్ణా ఆలయ నిర్మాణానికి నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఎమ్మెల్యే డీఎన్నార్ పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, సర్పంచ్ శీలం రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సతీష్, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధా, నేతలు పేరే రామకృష్ణ, అచ్యుత రాంబాబు, సయ్యపురాజు గుర్రాజు, గులిపల్లి సుధారాణి, కృష్ణారావు, కామేశ్వరరావు, మైనర్ బాబు, వెంకన్నబాబు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

15 నుంచి ఐటీఐలో ప్రవేశాలకు కౌన్సిలింగ్

గుడివాడ టౌన్: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో 2023–24 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు కేబీఆర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ జి.హరిధర్మేంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15వ తేదీ ఉదయం 8 గంటలకు మెరిట్ నంబర్ 01–59 వరకు, గ్రేడ్ పాయింట్లు 10.0 నుంచి 5.0 వరకు, అదేరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి 60–96 మెరిట్ మార్కులు 4.9 నుంచి దిగువ గ్రేడ్ పాయింట్ల వరకు సాధించిన విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. అడ్మిషన్ పొందిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. ఇతర కేటగిరి అభ్యర్థులు రూ.60 కాషన్ డిపాజిట్ చెల్లించాలన్నారు. మెరిట్ నంబర్ తెలుసుకునేందుకు గుడివాడలోని కేబీఆర్ ప్రభుత్వ ఐటీఐలోని హెల్ప్ డెస్క్‌లోను, 08674–295953, 8297574757, 8555952320 ఫోన్ నంబర్లలోనూ సంప్రదించాలని కోరారు. కౌన్సిలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు 10వ తరగతి మార్కుల జాబితా, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్ అన్ని ఒరిజినల్స్‌తో హాజరుకావాలని సూచించారు.

పురుగు మందు తాగిన వ్యక్తికి తప్పిన ప్రాణాపాయం

మచిలీపట్నంటౌన్: జిల్లా సర్వజన ఆసుపత్రిలో అరుదైన వైద్యం అందించి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తిని బ్రతికించిన ఘటన ఇది. బందరుకోటకు చెందిన డి.శ్రీనివాస్ ఆసుపత్రిలో అటెండరుగా పనిచేస్తున్నాడు. మే 31వ తేదీన పారాక్వాటు పురుగు మందు సేవించాడు. దీంతో అపస్మారక స్థితిలో చేరిన శ్రీనివాస్‌ను ఆసుపత్రిలో చేర్చగా ఆసుపత్రి డెప్యూటీ సూపరింటెండెంట్, జనరల్ మెడిసన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కాళిచంద్రశేఖర్ శ్రీనివాస్ కు మొదటి నుంచి వైద్యసేవలు అందించారు. శ్రీనివాస్ పూర్తి ఆరోగ్యంతో కోలుకోవటంతో సోమవారం డిశ్చార్జ్ అయ్యాడు. ఈ సందర్భంగా వైద్యుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ పారాక్వాటు పురుగు మందు తాగిన వ్యక్తులు దాదాపు మృతి చెందటం జరుగుతుందన్నారు. అయితే శ్రీనివాస్ మెరుగైన వైద్యం అందించటంతో బతికాడన్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు

మోపిదేవి: ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మోపిదేవి సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పెంజర్తి వెంకటేశ్వరావు పెదకళ్లేపల్లి నుంచి వెంకటాపురం మీదగా మోపిదేవి వస్తుండగా బైక్‌పై నుంచి అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108 సిబ్బంది ఘటనా స్థలంకు చేరుకుని బాధితుడిని రావివారిపాలెం పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన అనంతరం అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి

డీఎస్పీ శ్రీకాంత్



సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీకాంత్

గుడివాడ టౌన్: మాదక ద్రవ్యాల బారినపడి జీవితాలు నాశనం చేసుకోవద్దని గుడివాడ డీఎస్పీ పీ శ్రీకాంత్ అన్నారు. స్థానిక ఏఎన్నార్ కళాశాలలో సోమవారం మాదక ద్రవ్యాల వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారి నేడు ప్రపంచాన్ని పట్టి పీడిస్తుందన్నారు. డ్రగ్స్ వాడటం వలన యువత విచక్షణ కోల్పోతున్నారని తెలిపారు. ఏంచేస్తున్నారో తెలియని స్థితిలో నేరాలకు పాల్పడటం, వేగంగా వాహనాలు నడుపుతూ ప్రాణాలు కోల్పోతూ తల్లిదండ్రులకు మనో వేదన మిగులుస్తున్నారని చెప్పారు. ప్రత్యేకించి 15 నుంచి 25 ఏళ్ల లోపువారే మాదక ద్రవ్యాలకు దగ్గర అవుతున్నారన్నారు. యువత ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మాదక ద్రవ్యాలు సరఫరా, అమ్మకం, భద్రపర్చడం చట్టరీత్యా నేరమన్నారు. ఈ సమాచారం తెలిసిన వారు తోటి విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని పోలీసులకు 14500 లేదా 100లకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ తులసీధర్, ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్, కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, బీఎస్ఎస్ పద్మజ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువ ఆక్రమణలు అరికట్టాలి

స్పందనలో గుడివాడ ఆర్డీఓ పద్మావతికి రైతుల వినతి



రైతుల సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీఓ పద్మావతి

గుడివాడ టౌన్: ప్రజలు సమస్యలు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వెంటనే పరిష్కారం చెయ్యడానికి స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ పీ పద్మావతి తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. స్థానిక భూషణగుళ్ళ గ్రామానికి చెందిన రైతులు ఆర్డీఓను కలిసి భూషణగుళ్ల, నాగవరప్పాడు, గురివిందగుంట తదితర ప్రాంతాలకు చెందిన వందలాది ఎకరాల వ్యవసాయ భూమికి మురుగుకాలవ గుడివాడ పట్టణ సమీపంలో ఆక్రమణకు గురై పూర్తిగా మూసుకుపోయిందని దానిపై చర్య తీసుకోవాలని కోరారు. నాలుగున్నర మీటర్ల వెడల్పుగల ఈ మురుగు కాల్వ పట్టణ సమీపంలో మీటరుకూడా లేదని భారీ వర్షాలు కురిస్తే పంట నాశనం అవుతుందని ఆర్డీఓ దృష్టికి తెచ్చారు. ఇరిగేషన్, డ్రైనేజి అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లానని త్వరలో సమస్య పరిష్కరిస్తానని ఆర్డీఓ తెలిపారు. బాపులపాడు మండలం చిరివాడ గ్రామంలో తన వ్యవసాయ భూమి రీ సర్వేలో తక్కువగా చూపిస్తుందని సమస్య పరిష్కరించాలని ఆర్.రజినీ కుమారి వినతిపత్రం సమర్పించారు. విజయవాడకు చెందిన ఎ.కృష్ణవేణి బాపులపాడు మండలం చిరివాడ గ్రామంలో ఉమ్మడి కుటుంబ ఆస్తి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని వినతి పత్రం అందజేశారు. గుడివాడ మండలం శేరీగొల్వేపల్లి గ్రామానికి చెందిన సీహెచ్ మేరి క్రిస్టీనమ్మ తన ఇంటి ముందు మురుగుకాల్వ తవ్వకాలను ఆపాలని కోరారు.

ఘనంగా గంగానమ్మ ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న ప్రముఖులు

గుడివాడ టౌన్(నందివాద): నందివాద మండలం పోలుకొండ గ్రామంలో గంగానమ్మతల్లి ఆలయ వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. అర్చకుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. గుడివాడ అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య(బాబ్జి), బొర్రా కృష్ణమోహన్, యు వెంకటేశ్వరరావు, పిన్నమనేని సుభాష్ చంద్రబోస్, బొగ్గారపు తిరుపతయ్య తదితర ప్రముఖులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. నిజామాబాద్‌కు చెందిన పిన్నమనేని చిట్టి గంగయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రామదాసు ఆలయ అభివృద్ధికి రూ.3 లక్షలు వితరణ అందజేశారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

బంటుమిల్లి: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి విద్యార్థులకు మంచి సౌకర్యాలు కల్పించారని సీడీపీవో సముద్రవేణి అన్నారు. మండల పరిధిలోని చోరంపూడి గ్రామంలో సోమవారం అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యనభ్యసించిన ఐదు సంవత్సరాలు దాటిన పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను వివరించి విద్యార్థులకు సర్టిఫికెట్లు ఎంపీటీసీ తిరుమలశెట్టి లక్ష్మితో కలసి అందచేశారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ సుధారాణి, సూపర్‌వైజర్ నాగలక్ష్మి, వైద్య సిబ్బంది కమల రత్నం, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం తల్లిదండ్రులు, గ్రామస్తులతో ర్యాలీ నిర్వహించారు.